

# మనుషులూ.. రాక్షసులూ!

డా. పాలకోడేటి సత్యనారాయణ రావు

అద్దంలోకి చూడగానే క్షణకాలంపాటు గర్వంగా అనిపించింది- చెప్పుకోకూడదుగానీ, నేనేమీ ప్రపంచ సుందరికి తీసిపోను. చక్కగా తీర్చి దిద్దినట్లున్న కను ముక్కు తీరు నాది. సృష్టించేవాడంటూ ఒకడు ఉండి ఉంటే, ఆయన, నా పట్ల చాలా శ్రద్ధ చూపించాడన్నది స్పష్టం. నన్ను చూస్తే చాలు, ఆ శ్రద్ధ అందరికీ అర్థమవుతుంది. వేలూ, లక్షలు.. లక్షలన్నది అతిశయోక్తి కావచ్చునేమోగానీ...వేలమంది ఉన్న చోట్లలోనైనా సరే, నాకు రావాల్సిన గుర్తింపు నాకు వస్తూనే ఉంటుందంటే దానికి కారణం నా అందమే!

నా అందమంతా కేవలం ముఖం వరకేననుకున్న కూడా అది పొరబాటే... నాకు తెలుసు... నా శరీరం అంతాకూడా పోతపోసినట్లే ఉంటుంది... అద్భుతమైన అంగసౌష్టవం అంటూ ఏదైనా ఉంటే, దానికి నేనే సజీవ ఉదాహరణగా నిలుస్తాననుకోవచ్చు!

అందం దైవమిచ్చిందే కావచ్చు నేమోగానీ, అంగసౌష్టవం మాత్రం నా స్వయంశక్తి వల్లే వచ్చి ఉంటుందని నా నమ్మకం. కాదా మరి, రోజుకు ఎంతలేదన్నా-నాలుగైదు గంటల సాధన చేస్తూనే ఉంటాను కదా! పైగా, పూర్తిగా అలసిపోయాను అన్న ఆలోచన వచ్చాకగానీ... కాదంటే, 'ఈ రోజుకీ సాధనచాలు'నన్న మానసిక సంతృప్తి కలిగాక కానీ- సాధనను ఆపను గదా!

ప్రతిరోజూ... దాదాపు గత పదిహేను, పద్దెనిమిదేళ్ల నుంచీ-నృత్య సాధన చేస్తే... చేస్తోంటే- అందం, అంగసౌష్టవం అంతా పోటీ పడ్డట్లుగా నా శరీరంలో నాకే కానవస్తోంటే ఆశ్చర్యం ఏముందీ!!

-పెదవుల మీద చిన్న చిరునవ్వు, నా మనసులో తొణికిసలాడుతున్న గర్వానికి నిదర్శనంగా వచ్చి నిలిచింది.

అద్దంలోకి మరోసారి- పరిశీలనగా చూశాను.

మేకప్ అంతా పెర్‌ఫెక్ట్‌గా వచ్చింది... ఎక్కడా ఏలోటు ఏతేడా కనిపించటం లేదు... అంటే, అంతా సరిగ్గా ఉన్నట్లే లెక్క!

-ఇంక, రంగస్థలం మీదకు వెళ్లిపోవచ్చు!

ఆ తర్వాత, అక్కడ నన్ను, నా నృత్యాన్నీ చూడటానికి వచ్చిన రసజ్ఞుల ముందు ఆనందపారవశ్య తాండవం చేయవచ్చు!!

అదేమిటో... ఆ మహిమ ఏమిటో అర్థంకాదు, రంగస్థలం మీద తొలి పాదం మోపితేచాలు, మనసూ, శరీరమూ మైమరిచిపోతాయి...అదో అలౌకిక ఆనందం... ఏదో చెప్పలేని కొత్త అనుభూతి ముప్పిరిగొంటుంది. కాలి మువ్వల్లోంచి ఘల్లుఘల్లు శబ్దాలు నన్ను కొత్తలోకాల్లోకి నడిపించుకుపోతాయి. అప్పటినుంచి- నేనెవ్వరినో నాకే తెలీదు... శరీరంలో ప్రతి అణువూ, మనసులో ప్రతి మూలా పరమేశ్వరార్పితం అయిపోతాయి. పదము పదములో, క్షణ క్షణంలో భగవదారాధాన భావం నన్ను ఆనందాల అంచుల్లోకి తీసుకెళ్తాయి.

మళ్లీ- ప్రేక్షకుల చప్పట్లతోనే- పరంలోంచి ఇహంలోకి వచ్చిపడేది...

అప్పుడు- ప్రేక్షకుల రసజ్ఞతకు చేతులెత్తి మొక్కేది!

రెండు చేతులు జోడించి, వినమ్రంగా తల వంచి, కృతజ్ఞతను ప్రకటించేది!!

అద్దం ముందు కూర్చున్నప్పుడు నాలో ఉప్పొంగే గర్వం- రంగస్థలం మీద పాదం మోపగానే ఎటుమాయమవుతుందో నాకే తెలీదు!!

అప్పుడు... నేనొక వినయాల సంపదను!

అసాధారణ ఆనందానుభూతి విహ్వలను!!

-ఈ అనుభూతి కోసమే... మనసు నిత్యం ఆర్తితో అల్లాడుతుంటుంది. ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తుంటుంది... రంగస్థలం రారా రమ్మంటూ ఆహ్వానిస్తోందంటే చాలు, పులకించిపోతుంటుంది.

కానీ- రంగస్వామి... అవును, ఎంత సార్థకమైన పేరు ఆయనది... ఇప్పుడు అర్థమవుతోంది... ఆయనతో ఇన్నేళ్ల నుంచి పరిచయం ఉన్నా, ఎప్పుడూ ఆపేరుకు ఇంత అర్థం, పరమార్థం ఉందని కూడా అనిపించలేదు... ఈసారి ఆయన కనిపించగానే... 'రంగస్థల' స్వామిగా నమస్కారాలు చేయాలి... ఆయన వచ్చి, ఈ టూర్ ప్రతిపాదన చేసేసరికి నివ్వెరపోయాను...

'ఫిజీయా? ఫిజీ దేశంలో ప్రదర్శనలూ... పర్యటనలా?' అన్నాను అసహనంగా.

'అవునమ్మా... ఫిజీయే!' అన్నాడు రంగస్వామి.

అప్పటికి కొంచెం తేరుకున్నానేమో, పకపకా నవ్వాను: 'అమెరికా అనండి, ఆస్ట్రేలియా అనండి... పోనీ, జపాన్, చైనా అయినా ఓకే... ఆఖరికి థాయ్‌లాండ్, మలేసియాలైనా పర్వాలేదు. అక్కడి వారికి మన గురించీ, మన నృత్య సంగీత సాహిత్యాల గురించీ తెలుసు. వాళ్లు మన నృత్యాల్నీ ఆరాధిస్తారు, ఆదరిస్తారు. కానీ, ఇదెక్కడి దేశమండీ బాబూ... ఫిజీ... అసలు ఆపేరైనా ఇంతకు ముందు విన్నట్లులేదు! 'అంటూ కొంచెం సరదాగా, కొంచెం వ్యంగ్యంగా నేను వ్యాఖ్యానించాను.

రంగస్వామికి ఇలాంటివన్నీ మామూలే కాబోలు, చాలా ఈజీగా తీసుకొంటూ అన్నాడు: 'ఓపని చెయ్యండమ్మా... నేను రేపొస్తాను. ఈలోగా మీరు నెట్లోకి వెళ్లి, ఫిజీ గురించి చదవండి. నేనెంత చెప్పినా, మీకు అర్థం కానివి... అక్కడ తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు... ఆ తర్వాత మనం తీరిగ్గా మాట్లాడుకుందాం! మీరు ఓకే అంటేనేగదా, టూర్!'

'సర్లెండి, నెట్లో ఎలాగూ చూస్తాను! మీరు చెప్పండి, అసలు మీకా దేశం ఎందుకు నచ్చిందో, అక్కడికి ఎందుకు వెళ్లాలంటున్నారో...' అన్నాను.

ఆ మాటతో రంగస్వామికి ఎక్కడలేని హుషారూ వచ్చేసింది. అంత వరకూ సోఫాలో ఇబ్బందిగా కూర్చున్న ఆయన, క్షణంలో సర్దుకున్నారు-మొహం ఇంత చేసుకుని, చెప్పటం మొదలెట్టారు. నేనూ ఆసక్తిగానే వినటం ప్రారంభించాను.

-దక్షిణ పసిఫిక్ సముద్ర మధ్యంలో ఉందట ఫిజీ దేశం. దేశమంటే అదో దేశమూ కాదట... మొత్తం 322 ద్వీపాలు. జనాభా సుమారుగా పది లక్షలు...

-నాకు నీరసం వచ్చేసింది- 322 ద్వీపాల్లో పదిలక్షల జనాభా... అంటే, కాగడావేసి వెతికితే, అరగంటకో మనిషి కనిపిస్తాడు కాబోలు- అలాంటి చోట నృత్యప్రదర్శనలు!!

రంగస్వామికి మతిపోయిందన్న భావం నాలో



తళుక్కుమంది. అయితే, ఆయనకు మాత్రం నా ముఖంలో అప్పటికే మారిపోయిన రంగులు కనిపించలేదు. అందుకే, ఫిజీ గురించిన వివరాలు ఏకరువు పెడుతూనే ఉన్నారు–

అదొకప్పుడు నరమాంస భక్షకుల దేశమే అయినా, ఇప్పుడు మంచి నాగరికతనే పెంచుకుందట... వాస్తవానికి అక్కడ ఉండేవాళ్లలో మనదేశం నుంచి వెళ్లిన వాళ్ల సంతతే చాలా అధికమట!!

–ఆయన ఇంకా ఏదో చెప్పబోతోంటే, వారించాను: 'వద్దులెండి రంగస్వామిగారూ! నాకు ఇంట రెస్ట్ లేదు!' అంటూ లేచాను.

ఆయన ముఖంలో నెత్తురు చుక్కలేదు. అంతటి నిరసనను ఆయన ఊహించలేదు కాబోలు...

కానీ ఏంచేయను– నరమాంస భక్షకుల దేశంలో నృత్యప్రదర్శనలేంటి, నాన్సెన్స్!! మనిషిని చంపుకుని, నంచుకొని తినేవారి వారసుల్లో నృత్యాన్ని ఆదరించి, అభిమానించేంత సంస్కారం ఏముంటుంది!

రంగస్వామిగారికి సైతం వయసొచ్చేస్తోంది. అందుకే, ఈ ముదిమి ప్రేలాపనలు, ఈ ముతక ప్రతిపాదనలు!!

చాలా చిన్నబుచ్చుకుని, ఆయన వెళ్లిపోయారు... నేను సోఫాలోనే కూలబడిపోయాను.

ఏం జరుగుతోంది... కాలికి గజ్జకట్టి, ప్రపంచమంతా పర్యటిస్తూ, మన నృత్యాన్ని అంతర్జాతీయంగా అందరికీ పరిచయం చేస్తూ, అందరిచేతా అవుననిపించుకోవాలనే నా తపన ఏమిటి.. మనుషుల్ని తినే వాళ్ల మధ్య తైతక్కల్లాగ రంగస్వామి ఆలోచనలేమిటి... ఈసారి ఆయనొస్తే, ఘాటుగా నాలుగు పెట్టాలి... నాగురించి ఏమనుకుంటున్నారో స్పష్టంగా తెలుసుకోవాలి. ఇలాంటి పిచ్చి పిచ్చి పర్యటనల ప్రతిపాదనలు ఇంకెప్పుడూ తేవద్దని నిక్కచ్చిగా చెప్పేయాలి... అంతేగానీ...ఫిజీకి వెళ్లటం ఏమిటి... పిచ్చికాకపోతే...

హఠాత్తుగా ఓ సామెత గుర్తొచ్చింది నాకు– ప్రతివారూ జీవితంలో రెండు సార్లు ఆగ్రా వెడతారట. ప్రేమలో పడిన వెంటనే ఒకసారి... పిచ్చి ముదిరిన తర్వాత మరోసారి... మొదటిసారి తాజ్ మహల్‌ను చూసేందుకు, రెండోసారి ఆగ్రాలోని పిచ్చాసుపత్రిలో చేరేందుకు!!

అలాగే ఉంది నా పరిస్థితీనూ!

లేకపోతే, ప్రపంచంలో వందల దేశాలుంటే, మరీ ఎంచినట్లుగా ఫిజీ ఏమిటి!

ఫిజీ...ఫిజీ...ఫిజీ... అసలెక్కడ ఉందో ఈ దేశం... ఏమిటోదాని కథ!

నెట్ ఓపెన్ చేశాను. 'ఫిజీ' అని టైప్ చేసి, సెర్చ్ మెదలుపెట్టాను.

–ఆ తర్వాత, నెలన్నర, రెండు నెలలకే ఫిజీ అంటే ఏమిటో తెలియని ఇష్టం ఏర్పడిపోయింది.

మరో రెండు నెలలకు, ఇదిగో, ఇక్కడ... ఫిజీలో–లాబాసా నగరంలో– నా ఐదోప్రదర్శన ఇస్తూ...

–హఠాత్తుగా కరతాళధ్వనులతో ఉలిక్కిపడ్డాను.

వేదిక మీదకు వెళ్లాల్సిన వేళయిందన్న మాట!!

మరొక్కసారి– అద్దంలోకి చూసుకొని, మేకప్ సరిచేసుకున్నాను. కళ్లుమూసుకొని, మనసులో 'మాతృదేవోభవ, పితృదేవోభవ, గురుదేవోభవ' అని నమస్కరించుకున్నాను. మువ్వల చప్పుడు కాకుండా– బ్యాక్‌స్టేజ్ లోంచి, వేదిక మీద సైడ్ వింగ్స్ వద్దకు చేరి, ఆగాను. ఒక్కసారి రంగస్థలాన్ని పరిశీలనగా చూశాను. ఎటువైపు ఎన్నేసి అడుగుల స్థలం ఉందో, మరోసారి చూసుకున్నాను.

ఎక్కడైనాసరే, రంగస్థలం మధ్యకు వెళ్లబోయే ముందు నేను చేసే నిత్యకృత్యమే అది!

కానీ, ఈ రోజు మాత్రం... రంగస్థలం మీదకు వెళ్తోంటే–కొంచెం భయంగా ఉంది...

మళ్లీ– అతను...

అతను కనిపిస్తాడేమోనన్న భయం!!

ఈ వేళ కూడా వచ్చి ఉంటే...!

ఖర్మ... ఇదేం పిచ్చో అర్థం కాదు!!

అతనెవరో తెలీదు... మొదటిసారి 'నంది'లో ప్రదర్శన పూర్తయిన వెంటనే, మేకప్‌రూమ్‌లోకి వచ్చి మేకప్ తీసుకుంటుండగా– రంగస్వామి వచ్చారు.

'అమ్మా– మీ అభిమానట... ఎంతచెప్పినా వినటంలేదు– ఒక్కసారి మిమ్మల్ని వ్యక్తిగతంగా కలుసుకుని వెళతానంటున్నాడు!...'

ముఖం అదోలాపెట్టాను– 'ఇలాంటివి ఎందుకు చెప్పండి... నాకు నచ్చవని మీకు తెలుసు గదా!' అన్నాను.

'వేల మైళ్ల దూరం నుంచీ వచ్చాం మనం! మన కోసం ఎంతో డబ్బుపోసి మరీ వస్తున్నారు ఈ అభిమానులు... వాళ్ల జీవితాల్లో ఇదో గొప్ప మధురమైన రోజుగా మిగిలిపోతుందని వాళ్ల అభిప్రాయం! ఆ మాత్రం దానికి మనం కాదనటం దేనికీ! రెండు మూడు నిమిషాలు మాట్లాడి పంపిస్తే సరిపోతుంది...' అన్నారు రంగస్వామి.

'ఒక్కొరికీ రెండు మూడేసి నిమిషాల చొప్పునైతే, నా జీవితకాలం సరిపోదు...'

'కాదులెండి, ఇతను ఒక్కడే... ప్లీజ్!' అన్నాడు రంగస్వామి.

ఇంక కాదనలేకపోయాను.

కొంచెం చెదిరిన మేకప్‌తో, కొంచెం అలసటతో బయటకొచ్చాను.

చేతిలో పెద్దసైజు బొకేతో అతనక్కడ సిద్ధం!


'నా పేరు మైకెల్... నేను మీ ఫ్యాన్‌ని!' అంటూ పరిచయం చేసుకొన్నాడు అతను.

రంగస్థలం మీద నృత్యం ఎంత అలవోకగా చేస్తున్నానో, జీవితంలోనూ అంత తేలికగానే నటించగలనన్న సంగతి నాకు మొదటిసారి అర్థమయింది.

ఆ తర్వాత అతను– 'మీరు మంచి డాన్సర్' అన్నాడు. 'అందం అంటే మీదే' నన్నాడు. ఎన్నో డాన్సుల్ని చూశాను గానీ, మీరు చేసినంత గొప్ప డాన్స్‌ను ఇంతవరకూ చూడలేద'న్నాడు. 'మీరు సరేనంటే, మీతో ఓ ఫొటో తీయించుకుంటాన'నీ అన్నాడు.

వెంటనే కెమెరా తీసి, సెల్ఫ్‌లో పెట్టి, వచ్చి నాపక్కన, కొంచెం దూరంగానే, నిలబడ్డాడు.

ఫ్లాష్ వెలిగిన తర్వాత, క్లిక్ మంది. కెమెరాలో



మా ఇద్దరి ఫొటో ముద్రితం అయి ఉంటుంది... దీంతో, ఆ గొడవ అయిపోతుంది, అనుకున్నాను.

ఎంతో మర్యాదగా, ఎంతో అణకువగా బొకే అందించి, 'మళ్లీ కలుద్దాం' అన్నాడు.

'తప్పనిసరిగా!' అని మర్యాదగా జవాబు ఇచ్చాను.

అతను దాన్ని ఏవిధంగా అర్థం చేసుకున్నాడో, నాకు అప్పుడు అర్థం కాలేదు.

-చాలా చిత్రంగా అనిపిస్తోంది నాకు ఈ అభిమానుల పద్ధతులు... ఓసారి చికాగోలో డాన్స్ ప్రోగ్రామ్ తర్వాత, ఓ వ్యక్తి వచ్చాడు. 'అమెరికాలో అన్నీ పెద్దవే!' అన్నా ముతక సామెత ప్రకారమే, అతనూ- ఇంత ఒడ్డూ పొడుగూ ఉన్నాడు, తెల్లటి శరీర ఛాయ. ముఖమంతా చిరునవ్వు. ఓ వంద డాలర్ల నోటు మీద ఆటోగ్రాఫ్ ఇవ్వాల్సిందిగా కోరాడు.

'వద్దు, దీనివల్ల మీరు వంద డాలర్లు నష్టపోతారు... ఓ తెల్లకాగితం మీద సంతకం చేసి, బెస్ట్ విషెస్ రాస్తా!' అన్నాను.

అతను నవ్వేశాడు.

చేతిలోని నోటును అటూ ఇటూ తిప్పి, 'చూశారా! ఇప్పుడీ నోటు విలువ కేవలం వందడాలర్లు! మీరు సంతకం చేయండి. ఇది అమూల్యం అయిపోతుంది! అరగంటనో, గంటలోనో నా చేతిలోంచి వెళ్లిపోయే ఈ నోటు ఆజన్మాంతం నా దగ్గరే ఉండిపోయేలా చేసే మ్యాజిక్, మీ సంతకంలోనే ఉంది!' అన్నాడు.

ఆ మాటల్లో కృత్రిమత్వం లేదు. అసహజత్వం లేదు. గుండె లోతుల్లోంచి పెల్లుబుకుతున్న అభిమానం అది! ఇంక కాదనలేక సంతకం చేశాను!

-మరోసారి-బ్రిస్‌బేన్‌లో అనుకుంటా, ఓ నడివయస్కురాలు వచ్చింది. మనసారా అభినందించింది. ఆ తర్వాత 'రేపు ఉదయం మీరు మా ఇంటికి బ్రేక్ ఫాస్ట్‌కు రావాలి!' అంది ఆప్యాయంగా!

కొంచెం ఇబ్బందిగా కదిలాను... 'థాంక్యూ... కానీ, మా టీమ్ మెంబర్లను వదిలి...' కుదరదేమోనన్నట్లుగా అన్నాను.

ఆమె నవ్వేసింది... 'ఆ విషయం నాకు వదిలేయండి... మీ టీమ్ మేనేజర్‌తో మాట్లాడాను...వాళ్లందర్నీ కూడా ఆహ్వానిస్తున్నాను... మీరు సరే నంటే, మీతోబాటు వాళ్లూ వస్తారు!' అన్నారావిడ.

ఆశ్చర్యపోయాను... ఇంతమందితో- 'రాజువెడలె రవితేజములలరగ, భూ జనములు కడు పూజలొనర్పగ...' అన్నట్లు మందీ మార్బలంతో వాళ్లింటి మీదికి దండెత్తి వెడితే, ఏం బాగుంటుందీ అన్న సంశయంలో పడ్డాను.

నా ఆలోచనల్ని ఆమె ముందే పసిగట్టేసింది.

'పర్వాలేదు... మీరెంత మంది వచ్చినా, నాకు ఆనందమే! జీవితంలో ఇలాంటి అవకాశాలు ఎన్ని సార్లు లభిస్తాయి చెప్పండి!' అందామె.

నాకెక్కడో 'ఛెళ్లున' తగిలింది ఆ మాట... ఎన్నో వందల నృత్య ప్రదర్శనలకు హాజరయ్యాను నేను... ఎంతో తన్మయత్వాన్ని మనసారా ఆస్వాదించాను... ఎంతోమంది కళాకారుల ప్రతిభను మనసారా అభినందించాను... కానీ... ఏ ఒక్క బృందాన్ని అయినా... ఆఖరికి, ఏ ఒక్క కళాకారుడినైనా- నేను ఇంటికి పిలిచానా??

గుర్తుకు రావటం లేదు... అలా అనుకోవడం బాగానే ఉంటుంది గానీ, వాస్తవానికి ఎవర్నీ పిలవనే లేదు... ఎవరో కొందరు వాద్యకారుల్నీ, కొందరు గాయనీ గాయకుల్నీ, కొందరు రచయితల్నీ, సంగీత విద్వాంసుల్నీ... వాళ్లతో నాకు అవసరం ఉంటుందన్న సందర్భాల్లో పిలిచానుగానీ... కేవలం అభిమానంతోనే ఎవర్ని అయినా ఇలా పిలిచానా?? ఇంత అభిమానాన్ని చూపించానా??

ఆ మర్నాడు ఉదయం ఆమె- పేరు బార్బరా రోజ్... పేరు అయితే కొందరికి బార్బేరియస్‌గా అనిపించి ఉండొచ్చుగానీ, ఆమె మనసు మాత్రం రోజ్‌లాగే సున్నితంగా, అందంగా అనిపించింది. ఎంతటి అభిమానాన్ని మాకు ఆదరంగా వడ్డించిందో... అపూర్వం... అనిపించింది.

-ఇతనిదీ అలాంటి అభిమానమేనా??

అలాంటిదే అయితే, అతన్ని అనుమానించాల్సిన అవసరం ఏముందీ!!

అభిమానం అనేక రకాలు!!

ఫిజీలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న 'నంది' నగరంలో ప్రదర్శన తర్వాత- లౌటోకా నగరంలో తర్వాతి ప్రదర్శన! 'నంది'లో భామాకలాపం తర్వాత, లౌటోకాలో 'పద్మావతీ కల్యాణం..' ఈ ప్రదర్శను తర్వాతది లబాసా నగరంలో.. అక్కడ 'విప్రనారాయణ'- ఇలా ఒక్కో చోట, ఒక్కో అంశంపై నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు రంగస్వామి.

వేర్వేరు చోట్ల, వేర్వేరు ప్రదర్శనలయితే, ప్రతికల్లో టీ.వీల్లో సమీక్షలు, ఫొటోలు, కవరేజ్ వేర్వేరు విధంగా ఉంటాయన్నది ఆయన ఆలోచన... మంచి ఆలోచనే!

లౌటోకాలో 'పద్మావతీ కల్యాణం' అద్భుత ప్రదర్శనే అయింది. 'ఫిజీలోనా ప్రదర్శనలు!' అంటూ నిరసన స్వరంతో మాట్లాడిన నాకు, ఫిజియన్లు స్పష్టమైన సమాధానం చెప్పినట్లే అయింది. వాళ్లలోని కళారాధన నాకు బోధపడింది. 'తప్పుచేశాను!' అనుకొంటూ, నా గత వ్యాఖ్యలకు పశ్చాత్తాప పడ్డాను.

ప్రదర్శన పూర్తయిన పది నిమిషాలకు... గ్రీన్ రూమ్ బయట మైకేల్! ఆశ్చర్యపోయాను. 'ఇతనేమిటి, ఇక్కడ.. ' అనుకున్నాను.

నవ్వుతూ పలకరించాను. 'కేవలం మీ ప్రదర్శన చూసేందుకే వచ్చాను!' అన్నాడు.

'థ్యాంక్స్' అన్నాను నేను, కొంచెం ఇబ్బంది ఫీలవుతూ.

'మీరు గుర్తించారో లేదో, నేను మీ ఫ్యాన్‌ని!' అన్నాడు.

'థ్యాంక్స్' అన్నాను మళ్లీ.

చిరాకు పెరుగుతోంది తెలియకుండానే!



ఇదో రకం ఈవ్ టీజింగ్‌లా ఉంది నాప్రాణానికి!

'మీరు ఫ్రీగా ఉంటే, రాత్రి డిన్నర్‌కు వెడదాం!' అన్నాడు, మైకేల్.

అర్థమయింది- ఈ పిలుపు ముందుగా డిన్నర్‌కు! ఆ తర్వాత.. ఏం ప్లాన్ చేస్తున్నాడు ఆ తర్వాత... మనిషి రంగులు క్రమంగా బయటపడుతున్నాయి!

భారతీయ నృత్యం పట్ల ఆరాధన ఉన్న వాడికి, భారతీయ సంస్కృతి గురించి కూడా తెలిసి ఉండాలి గదా! కన్వీనియెంట్‌గా మర్చిపోతారు కాబోలు, ఇలాంటి విషయం!

'నో థ్యాంక్స్... అలా కుదరదులెండి!' అన్నాను కొంచెం పొలైట్‌గా.

'మీ ఇష్టం... బలవంతం ఏమీలేదు.. కొత్త ఊరుగదా- మీకు ఏమీ తెలిసే అవకాశం లేదు... తెలిసిన వాళ్లు ఒకరు మీతో ఉంటే, బాగుంటుంది కదా, అని అడిగాను!' వివరణ ఇచ్చాడు మైకేల్.

'ఓ.కే... బై దెన్!' అంటూ సంభాషణ ముగించే ప్రయత్నం చేశాను.

కానీ, వదిలితేనా... కనీసం పది నిముషాల పాటు అక్కడే, నాతో భేటీ వేసిన తర్వాతే కదిలాడు మైకేల్.

అదీ-'మళ్లీ కలుద్దాం...' అంటూ వీడ్కోలు చెప్పాడు.

'మళ్లీనా నాయనా!' అనుకున్నా..

తర్వాతి ప్రదర్శన లబాసా నగరంలో... అది వేరే ద్వీపంలో... ఎంత పిచ్చి ఉన్నా, నాకోసం సముద్రాలు దాటి వస్తాడా ఏమిటి!! ఇదేదో క్యాజువల్ వ్యవహారమే అయి ఉంటుంది...

లబాసాలో ప్రదర్శన జరుగుతున్నప్పుడు యథాలాపంగా ప్రేక్షకులకేసి చూస్తున్న సమయంలో- అప్పుడు కనపడ్డాడు మైకేల్!

ఉలిక్కిపడ్డాను...

నేను చూసింది నిజమేనని నిర్ధారించుకోవడానికి మళ్లీ చూశాను. సందేహం లేదు, పొరబడనూ లేదు.. అతనే!!

నన్నేంటి ఇలా వెంటబడుతున్నాడు... వీడి పిచ్చికూలా! అనుకున్నాను...

రంగ స్థలం మీద పాదాలు, అలవాటుకొద్దీ నర్తిస్తున్నాయి. ముఖంలో హావభావాలూ అంతే... కానీ, గుండెల్లో తెలీని భయం!

ఇక్కడంతా నరమాంస భక్షకులు ఉండేవారని కదా రంగస్వామి చెప్పారు... ఇతనూ అంతేనేమో! కోడిని పెంచి, మాంసం పెరిగాక కోసుకుతినే పద్ధతే కావచ్చు ఇది!

భయంతో వణికిపోయాను- దేశం కాని దేశంలో... ఇలా చిక్కడిపోయేనేంటిరా భగవంతుడా!

నృత్యం కూడా ఓ రకమైన భగవదారాధనే అంటారు. అందులోనూ నేను చేస్తున్న నృత్యాలన్నీ స్వామివారి గురించే అయినప్పుడు, ఈ విపరీతాలేమిటి! అసలు, క్షేమంగా మళ్లీ హైద్రాబాద్ చేరతానా... లేకపోతే, ఫిజీలోనే నా కథ 'ఫినిష్' అయిపోతుందా?

మనసులో రకరకాల భయాలు... ఆందోళనలు!

అందుకే ప్రదర్శన పూర్తవగానే- నన్ను హోటల్‌లో దింపాల్సిందిగానూ, ఎవరికీ నా హోటల్ డిటైల్స్ ఇవ్వొద్దనీ రంగస్వామికి మరీ మరీ చెప్పాను. ఆ ప్రకారమే- ప్రదర్శన పూర్తయిన వెంటనే హోటల్‌లోకి వచ్చి పడ్డాను. అయినా- ఏ క్షణంలో... ఎవరు తలుపు తోసుకొని, లోపలికి వచ్చేస్తారోనన్న భయమే!

'ఈ గండం గడిస్తేచాలు, భగవంతుడా!' అని ఎన్నిసార్లు దేవుడికి దణ్ణం పెట్టుకొన్నానో నాకే తెలీదు.

నా మొరలు ఆ దేవుడు విన్నట్లున్నాడు. లౌటాకో నుంచి సురక్షితంగానే బయటపడ్డాను. కానీ, ఫిజీ నుంచి పూర్తిగా బయటపడితే తప్ప 'అమ్మయ్య!' అనుకొనే వీల్లేదని నాకు తెలుసు.

లౌటాకో నుంచి 'సవుసవు' నగరానికి వచ్చాం.


ఇదిగో, ఇక్కడా- అదే భయం నన్ను నీడలా వెంటాడుతోంది.

మనిషికి-భయానికి మించిన మరణం లేదుగా బోలు! ఈ క్షణ క్షణం భయం నుంచి దూరంగా... దూరంగా ఎందుకు, ఇంటికి వెళ్లిపోతే సరిపోతుంది!!

మందమతి? కాకపోతే మరేమిటి... ఈ ఆలోచన ఇంత కాలం రాకపోవటానికి ఇంకేం కారణం ఉంటుంది?

ఆ ఆలోచన రావడం తరువాయి, రంగస్వామి గారికి విషయం చెప్పి- తిరుగు ప్రయాణం ఏర్పాట్లు చేయమని కోరాను.

ఆయన ఆశ్చర్యపోయారు- 'అదేంటమ్మా... ఇలా ఎలా కుదురుతుంది చెప్పండి... ఒప్పందాల ప్రకారం మనం అన్ని ప్రదర్శనలూ పూర్తి చేయాల్సిందే! మరో దారి లేదు. పైగా, మీకు తెలీనివి కావు- ఇలాంటి ఫ్యాన్ ప్రాబ్లమ్స్ ఎక్కడైనా ఉంటాయి. సివియర్‌గా ఉందనుకుంటే మనం సెక్యూరిటీ పెంచుకుందాం!' అన్నారు.



నాకేమనాలో తెలీలేదు. నావన్నీ అనవసర భయాలేమోనన్న భావనా కలిగింది!

మనసు కొంచెం దిటవు చేసుకొని, మేకప్‌కు సిద్ధమయ్యాను.

తెర తొలిగింది. వందలకొద్దీ లైట్ల వెలుగులు.

చీకట్లోంచి వెలుగులోకి...

భయంలోంచి అభయంలోకి...

కలతలోంచి ఆనందంలోకి...

వయ్యారం ఒలకబోస్తూ కదిలాను...

ప్రేక్షకులకేసి చూడాలంటే భయంగానే ఉన్నా, నెమ్మదిగా చూపును కదిలించాను.

-అదిగో... కనిపిస్తూనే ఉన్నాడు మైకేల్...

నల్లగా... చింత మొద్దులాగ- అంతెత్తున...

అతనూ నన్ను చూస్తున్నట్లే ఉంది... నానెన్స్- నన్ను చూడటానికే గదా, వచ్చాడు.. చూస్తున్నట్లు ఉండటం ఏమిటి!

గుండెకొట్టుకొనే వేగం పెరుగుతోంది.

ఆ తర్వాత-మనసు మనసులో లేదు. ప్రదర్శనలో అంకిత భావం తగ్గుతున్నా

భావన పెరుగుతున్నా... చేయగలిగేది లేకపోయింది.

మధ్యలో రవ్వంత విరామం లభించగానే, రంగస్వామిగారికి విషయం చెప్పాను- 'అతను... మళ్లీ వచ్చాడు! ఈవేళ ఏమైనా గొడవ అవుతుందేమో... వెనక్కు పంపించేయమంటే విన్నారు గాదు!' విసుక్కుంటూనే అన్నాను.

'మీరేమీ కంగారు పడకండి...నేను చూసుకుంటాను గదా! ప్రమాదం ఉందనిపిస్తే, పోలీసుల్ని పిలిపిస్తా!...'

'ప్రమాదం ఉందనిపిస్తే ఏమిటి.... ఉంది! ఉంది, ఉంది...ఉంది!! మీకే అర్థం కావటం లేదు!' తీవ్రంగా అన్నాను.

'చెప్తున్నా కదా... నాకు వదిలేయండి! మీకు ఏ సమస్యా రాకుండా చూసుకునే బాధ్యత నాది!' అన్నారు రంగస్వామి.

ఇంక చేసేదేమీ లేదు! జరగాల్సింది ఏదో జరుగుతుంది!

నృత్య ప్రదర్శన పూర్తయింది.

తర్వాత... 'గీత ఎలా ఉందో', అనుకుంటూ గ్రీన్ రూమ్‌లోకి చేరాను.

అయిదారు నిముషాలకు... ఆశించినట్లే- భయపడుతున్నట్లే తలుపు మీద చప్పుడు!

తీయాలా... వద్దా... అన్న సందిగ్ధాన్ని అనుభవించి, చివరికి తలుపుతీశాను.

రంగస్వామి గారు!

ఊపిరి పీల్చుకొన్నాను. 'చెప్పండి!' అన్నాను.

ఆయన పెదవుల మీద చిరునవ్వులు!

'చెప్పండి!' అన్నాను మళ్లీ.

'మీ అభిమాని-'

'పంపేశారా...థ్యాంక్యూ!' అన్నాను. గుండె బరువు తగ్గటం నాకు తెలుస్తోంది.

'లేదు. అతన్ని తీసుకొచ్చాను... మీ దగ్గరికే!' అన్నారు రంగస్వామి.

నేను నివ్వెరపోతోంటే... నా ముందుకొచ్చాడు మైకేల్ రాక్షసుడు!

కూడా...అతని భార్య కాబోలు... ఆమె చేతిలో చిన్నపాప!

నాకు నోరు పెగలటం లేదు. గుండె చిక్కబట్టుకొని, అక్కడే నిలబడ్డాను.

మైకేల్ నన్ను చూస్తూ, చిరునవ్వులు చిందిస్తూ- 'హాయ్... ఎలా ఉన్నారు...' అంటూ తన పక్కనే ఉన్న మహిళను పరిచయం చేశాడు: 'దిసీజ్ మై వైఫ్... మిషెల్!.. అండ్ దిసీజ్ మై స్వీట్ లిటిల్ ఛైల్డ్...'

రాక్షస పరివారం కాబోలు! అనుకొంటూ 'హాయ్' అన్నాను, చిరునవ్వుల్ని పెదవుల మీదకు తెచ్చుకొంటూ.

ఆమె... మిషెల్ నవ్వుతూ- తన చేతిలోని బ్లాంకెట్‌ను తొలగిస్తూ, లోపలున్న రోజుల గుడ్డులాంటి పాపను చూపించింది.

'మైక్‌కు మీరంటే చెప్పలేనంత అభిమానం. మీ నృత్యం అంటే మరీనూ! అందుకే మీమీద ఇష్టంతో- పాపకు మీపేరే పెట్టాడు... 'అర్చన'అని! మీ బ్లెస్సింగ్స్ తీసుకోవాలంటూ... డాక్టర్ ఈ ప్రయాణం వద్దంటున్నా వినక, నన్నిలా లాక్కొచ్చాడు. పాప పెద్దయ్యాక, మీ దగ్గరికి పంపి, నృత్యం నేర్పిస్తాడట! మీ తర్వాత, మీ అంత డాన్సర్ కావాలిట మా చిన్ని అర్చన!'...

అప్పటికే దాదాపు చచ్చిపోయాను నేను... సిగ్గుతో!

'రాక్షసులు' అనుకొన్నవారు నా కళ్లముందే అనూహ్యమైన ఎత్తులకు ఎదుగుతోంటే... నేనిటు పాతాళంలోకి కుంగిపోతున్నాను...

నా పట్ల వారి అభిమానం ముందు... నేనెంత!

వాళ్ల ముందు నిలబడటానికి నాకున్న అర్హత ఏమిటి అనే ఆలోచనలో పడ్డాను నేను!!

★

